ఓటీటీలోకి 'ఆర్ఆర్ఆర్' డాక్యుమెంటరీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

8 లో..


తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

## ఇదండీ..కబురు..




లోపల ఆయన పదవికే భరోసాలేదని బాధపడుతుంటే మధ్యలో మీ భరోసా లొల్లి ఏందయ్యా?!

సంపుటి : 23 సంచిక : 13 | గురువారం డిసెంబర్ 26 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

# ఆపరేషన్ ఫార్ములా - ఈ .. కేటీఆర్ మెడకు బిగుస్తున్నఉచ్చు



- దానకిశోర్ స్టేట్ మెంట్ రికార్డు చేసిన ఏసీబీ
- ప్రైవేట్ ప్లేస్ లో 7 గంటల పాటు విచారణ
- కీలక డాక్యుమెంటు స్వాధీనం చేసుకున్న ఆఫీసర్లు
- త్వరలో కేటీఆర్, అర్వింద్ కూ నోటీసులు!

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 25

ఫార్ములాలి-ఈ ఆపరేషన్ వేగంగా సాగుతోంది. ఈ కేసులో ఇవాళో, రేపో మాజీ మంత్రి కేటీఆర్, అప్పటి హెచ్ఎండీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ కు, అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఫార్ములా ఈ కేసులో ఫిర్యాదు దారుడిగా ఉన్న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ వాంగ్మూలాన్ని నిన్నే ఏసీబీ రికార్డు చేసింది. ఆయన నుంచి కీలక డాక్యుమెంట్లను ఏసీబీ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. సుమారు ఏడు గంటలపాటు దాన కిషోర్ ను ఏసీబీ అధికారులు విచారించారు. ఆయన ఇచ్చిన డాక్యుమెంట్ల ఆధారంగా కేటీఆర్, అరవింద్ కుమార్ కు నోటీసులు జారీ చేస్తారని తెలుస్తోంది. ఫార్ములా ఈ-రేసు నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీసంస్థకు సొమ్ము చెల్లించారంటూ దానకిశోర్ ఏసీబీకి ఈ ఏడాది అక్టోబరు 18న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్‌బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించారని దానకిశోర్ పేర్కొన్నారు. ఈ మేరకు గత ప్రభుత్వ హయాంలో పురపాలకశాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంటూ ఏసీబీ ఇటీవల కేసు నమోదు చేసింది. పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ నుఏ2గా, అప్పటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి ఏ3గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ మేరకు ఏసీబీ తన దర్యాప్తును వేగవంతం చేసింది.



# మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు

కబురు,మెదక్:డిసెంబర్ 25

వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు.

# వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుంది

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 25

హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో పెట్టుకున్న లక్ష్యాన్ని అందుకోడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళు ్తుందన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుందన్నారు.



మిగతాది 2లో

## ప్రేమ పేరుతో వేధింపులు.. యాసిడ్ తాగి యువతి మృతి

హైదరాబాద్: నగరంలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డిగ్రీ విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే..



మిగతాది 2లో

# శ్రీతేజ్ కుటుంబానికి రూ.2కోట్ల సాయం



కబురు,హైదరాబాద్ డిసెంబర్ 25

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరఫున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు కు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్ ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

# సినిమా ఇండస్ట్రీ ఏపీకి వెళ్తే తెలంగాణకు నష్టం



కబురు,హైదరాబాద్ డిసెంబర్ 25

అసెంబ్లీ సమావేశాల్లో అల్లు అర్జున్ ఇష్యూ చర్చించాల్సిన అవసరం లేదన్నారు బండి సంజయ్. దీని వెనక మతలబేంటో సీఎం రేవంత్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సినీ ఇండస్ట్రీ ఏపీకి తరలివెళ్ళాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రానికి నష్టం జరిగేలా అధికారంలోని కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బీజేపీ జాతీయ అధ్యక్షుడైతే సంతోషిస్తానన్నారు బండి సంజయ్.రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను కాంగ్రెస్ పార్టీయే అడుగడుగునా అవమానించిందన్నారు.. కేంద్రమంత్రి బండి సంజయ్. కాంగ్రెస్ చేసిన పాపం పోవాలంటే కొత్తగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని.. సీఎం రేవంత్ దర్శించుకోవాలన్నారు. అలాగే విపక్ష నేత రాహుల్ గాంధీ పంచతీర్థాలు తిరగాలన్నారు.అలాచేస్తే కాంగ్రెస్ పాపం కొంతయినా పోతుందన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రజల సొమ్ముతోనే మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు.



# భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసుల నోటీసులు

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 25

భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని పేర్కొన్నారు. బంజారాహిల్స్ పీఎస్‌లో విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

# రేవంత్ సర్కార్ మహిళల్ని నమ్మించి మోసం చేసింది'

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 25

మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు. రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని కవిత డిమాండ్ చేశారు.రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు.



తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# హసీనా అప్పగింత సాధ్యమేనా?



బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచీ మన దేశానికి తలెత్తుతున్న దౌత్య సమస్య లకు తాజాగా మరొకటి వచ్చిచేరింది. గత ఆగస్టు నుంచీ భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని సోమవారం బంగ్లా విదేశాంగ శాఖ దౌత్య సందేశం పంపింది. హసీనా అవినీతి పాలనను వ్యతిరేకిస్తూ విద్యార్థుల నాయకత్వంలో జనాగ్రహం వెల్లువెత్తి ఆమె ఆ దేశం నుంచి నిష్క్రమించారు.నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ మైనారిటీలకూ, హసీనా హయాంలో బాధ్యతలు నిర్వర్తించిన నేతలకూ, ఉన్నతాధికారులకూ గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దాడులూ, దౌర్జన్యాలూ, నిర్బంధాలూ తప్పడం లేదు. ఆఖరికి న్యాయమూర్తుల్ని సైతం వెంటాడుతున్నారు. భయోత్పాతంలో ముంచెత్తుతున్నారు. చాలామంది అజ్ఞాతంలోకి పోయారు. దీన్నంతటినీ ఆపాలనీ, మైనారిటీలకు రక్షణ కల్పించాలనీ మన దేశం ఇప్పటికే బంగ్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ కక్షపూరిత చర్యలు ఎక్కడా తగ్గిన దాఖలా లేదు. పైగా భారత మీడియా ఉన్నవీ లేనివీ కల్పించి తప్పుడు ప్రచారం చేస్తున్నదని అక్కడి ప్రభుత్వం ఆరోపిస్తోంది. అంతేకాదు... దానికి సమాంతరంగా అంతా బాగానే ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేస్తోంది. 'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చిన కథనమే ఇందుకు ఉదాహరణ. విద్యార్థి బృందాలు దేశాభివృద్ధికి, అవినీతి అంతానికి ప్రణాళికలు వేస్తున్నట్టు ఆ కథనం సారాంశం. మైనారిటీలు సురక్షితంగా ఉన్నట్టు ఆ వర్గాలతోనే చెప్పించారు. నోబెల్ శాంతి బహుమతి పొందిన యూనస్ పాలన తీరుతెన్నులు గమనిస్తే పరిస్థి తులు ఆయన నియంత్రణలో ఉన్నట్టు కనబడదు. మైనారిటీల సంగతలావుంచి అసలు ముస్లిం మహిళలకే ఇబ్బందులు తప్పడం లేదు. మత ఛాందసవాదులు రంగంలోకి దిగి బురఖా ధరించని బాలికలనూ, మహిళలనూ నడిరోడ్లపై పంచాయతీలు పెట్టి హింసిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. హసీనా ఏలుబడిలో అవినీతి పెరిగిందనటంలో సందేహం లేదు. పదవి కాపాడుకొనేందుకు ఎన్నికల ప్రక్రియను ఏమార్చారన్న ఆరోపణల్లో కూడా నిజం వుంది. కానీ దానికి విరుగుడు ఈ అరాచకమా?! ప్రభుత్వాలను కూలదోసిన సందర్భాల్లో పాలకులు పరారీ కావటం, వేరేచోట ఆశ్రయం పొందటం అసాధారణమేమీ కాదు. హసీనా ఢిల్లీకి ఆదరా బాదరాగా వచ్చినా ఇక్కడినుంచి లండన్ వెళ్లాలని ప్రయత్నించారు. కానీ బ్రిటన్ ఆమె వినతిని తోసిపుచ్చింది. బంగ్లాలో హఠాత్తుగా బయ ల్దేరిన ఉద్యమానికి అమెరికా ఆశీస్సులున్నాయని ఆరోపణలొచ్చిన నేపథ్యంలో బ్రిటన్ ఆమె వినతిని తిరస్కరించటంలో వింతేమీ లేదు. కానీ ఆమెను అప్పగించాలని కోరిన వెంటనే మన ప్రభుత్వం అందుకు అంగీకరించటం సాధ్యమేనా? చట్టబద్ధ పాలన ఆనవాళ్లు లేవు సరికదా... ఎడాపెడా కక్షపూరిత విధానాలు అమలవుతున్నప్పుడు కోరిన వెంటనే ఒక మాజీ అధినేతను అప్ప గిస్తారని బంగ్లా ఎలా అనుకుంది? ఉగ్రవాదుల ఆటకట్టించేందుకు వీలుగా రెండు దేశాలూ 2013లో నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తగిన సాక్ష్యాధారాలు అందజేశాకే నేరస్తుల్ని అప్పగించాలని ఉన్న నిబంధనను కాస్తా వారెంటు జారీ అయితే చాలు అప్పగించవచ్చని సవరిస్తూ 2016లో ఆ ఒప్పందాన్ని సరళం చేశారు. కానీ తనపై పెట్టిన కేసులు న్యాయసమ్మతమైనవి కాదని, అందువల్ల అప్పగింత వినతిని తిరస్కరించాలని హసీనా మన ప్రభుత్వాన్ని కోరుకోవచ్చు. రాజ కీయ కారణాలతో అప్పగించాలని కోరితే తిరస్కరించొచ్చని ఒప్పందంలోని నిబంధనలే చెబుతున్నాయి. సంక్లిష్టమైన ఈ ప్రక్రియంతా పూర్తికావటానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో హసీనా విషయంలో అక్కడి న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా వ్యవహరిస్తుందన్న విశ్వాసం తమకు లేదని మన ప్రభుత్వం చెప్పే అవకాశం కూడా ఉంది. ఒకవేళ మన దేశం అందుకు సంసిద్ధత చూపినా హసీనా మన కోర్టుల్ని ఆశ్రయించి ఉపశమనం పొందుతారు. బ్రిటన్‌తో మనకు నేరస్తుల అప్పగింత ఒప్పందం ఉన్నప్పటికీ రుణాలు తీసుకుని బ్యాంకులను వేలాది కోట్ల రూపాయల మేర మోసగించి పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా వంటివారిని రప్పించటం అసాధ్యమవుతున్నది. మన దేశంలో ఉగ్రవాద ఘటనలకు పాల్పడి పరారీలో ఉన్న నేరగాళ్లను పట్టి అప్పగించటానికి కొన్ని యూరప్ దేశాలు నిరాకరిస్తున్నాయి. మన న్యాయవ్యవస్థ, జైళ్లు ప్రామాణికంగా లేవన్న కారణాలు చూపుతున్నాయి. అసలు తన ప్రస్థానం ఏ విధంగా కొనసాగించదల్చుకున్నదో బంగ్లాదేశ్ నిర్ధారించుకోవాలి. ఆ దేశ ఆవిర్భావానికి మూలకారణమైన 'బెంగాలీ భావన'కు తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోంది. బంగ్లా విముక్తిని తాము గుర్తించబోమని చెప్పే ఘనులు తయారవుతున్నారు. అడుగడుగునా మత ఛాందసుల ప్రాబల్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. మన దేశంతో సంబంధాల పునరుద్ధరణకు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకొనేందుకు బంగ్లా ఇంతవరకూ సిద్ధపడలేదు. పైగా పాకిస్తాన్‌తో అంటకాగేందుకు ఉత్సాహపడుతోంది. 53 యేళ్ల క్రితం ఒక దేశంగా ఆవిర్భవించటానికి ముందు పాక్ సైనిక పాలకులు తమను ఎంత దారుణంగా అణచేశారో ఈ తరం మరిచిపోయి ఉండొచ్చు. 30 లక్షలమందికి పైగా ప్రజల బలిదానాలతో ఏర్పడిన దేశం కళ్లముందు కుప్పకూలుతుంటే నిశ్చేష్టులై ఉండిపోవటం విషాదకరం. అత్యంత విషమ పరిస్థితుల్లో కూడా ఎంతో అప్రమత్తతతో, వివేకంతో వ్యవహరించిన శ్రీలంక పౌరులను ఆదర్శంగా తీసుకుంటేనే దేశానికి మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని బంగ్లా ప్రజలు తెలుసుకోవాలి.

# శ్రీతేజ్ కుటుంబానికి రూ.2కోట్ల సాయం

మొదటిపేజీ తరువాయి

బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు."శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వెంటిలేషన్ తీసేశారు. బాలుడు త్వరలోనే మనందరి మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నా. న్యాయపరమైన అంశాల కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నా. అన్ని రకాల అనుమతులు తీసుకుని శ్రీతేజ్‌ను 10 రోజుల క్రితం పరామర్శించా. ఆ సమయంలో వెంటిలేషన్‌పై ఉన్నాడు" అని అల్లు అరవింద్ తెలిపారు."నిన్నటికి, ఈరోజుకి బాలుడి ఆరోగ్యం కాస్త మెరుగు పడింది. అతడి హెల్త్ కండిషన్ బాగుందని వైద్యులు తెలిపారు. బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్, 'పుష్ప 2' నిర్మాతలు, దర్శకుడు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగాం. సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలం కలిసి వెళ్తాం. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుంది" అని దిల్ రాజు తెలిపారు.ఎఫ్‌డీసీ ఛైర్మన్ అయినందుకు సీఎంను కలుస్తున్నారా? ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య చోటుచేసుకున్న పరిణామాల గురించి వెళ్తున్నారా? అని దిల్ రాజును మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తాను చిత్ర పరిశ్రమ వ్యక్తినని, ఇండస్ట్రీ– ప్రభుత్వం మధ్య వారధిగా ఉండాలని సీఎం బాధ్యత ఇచ్చారని, అదే చేస్తున్నానన్నారు. అల్లు అర్జున్‌ను కలిశారా? అని అడగ్గా ఇంకా లేదని, త్వరలోనే కలుస్తానని చెప్పారు.

# జలాల్‌పురం చెరువుకట్టపై బారికేడ్లు ఏర్పాటు

కబురు న్యూస్, భూదాన్‌పోచంపల్లి:

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం చెరువు కట్టపై రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం బారికేడ్లు ఏర్పాటు చేశారు. గడిచిన పదిహేను రోజుల్లో రెండు కార్లు చెరువులోకి దూసుకెళ్లి ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో రక్షణ చర్యలు చేపట్టడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు.ఈ నేపథ్యంలో 'అసలే ఇరుకు.. ఆపై మలుపు' అనే శీర్షికన ఈనెల 22న సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రమాదాలు నివారించడానికి పోలీసులు చెరువు కట్టపై 11 భారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



### మైనర్ డ్రైవింగ్.. తల్లికి శిక్ష

సిరిసిల్ల క్రైం: బాలుడు వాహనం నడుపుతూ ఒకరి మరణానికి కారణమైన కేసులో.. అతని తల్లిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనపై డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం అందించిన వివరాలివి. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రం బస్టాండ్ సమీపంలో ఈ నెల 18న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. రుద్రంగి మండలానికి చెందిన గడ్డం లక్ష్మి.. మైనర్ అయినప్పటికీ తన కొడుక్కి వాహనం ఇవ్వడం వల్ల ప్రమాదం జరిగింది.ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కంటే రాములు (72) తీవ్రగాయాలతో మృతి చెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. మైనర్‌కు బైక్ ఇచ్చిన తల్లిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమైతే.. పెద్దలు జైలుకు వెళ్లాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు.

# ప్రేమ పేరుతో వేధింపులు.. యాసిడ్ తాగి యువతి మృతి

మొదటిపేజీ తరువాయి

న్యూ భవానీ నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థిని పూర్ణిమ.. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి రాగానే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రేమ పేరుతో నిఖిల్ అనే యువకుడు వేధిస్తున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు ఆరోపించారు.యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జవహర్‌నగర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన కుటుంబసభ్యులు.. ఆందోళనకు దిగారు. తమ కుమార్తె మరణానికి కారణమైన యువకుడిని ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని.. నిందితుడిని అరెస్టు చేస్తామని పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

# వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుంది

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందన్నారు. 2023-24లో 15,623 మెగావాట్లు, 2027-28లో 20,968 మెగావాట్లు, 2034-35లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ - 2024పై వచ్చే నెల 3న హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ లో వాటాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని భట్టి తెలిపారు.

# వాజ్‌పేయీ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పని చేశారు - కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్:

మాజీ ప్రధాని వాజ్‌పేయీ భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలను ప్రపంచానికి చాటారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వాజ్‌పేయీ శత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. వాజ్‌పేయీ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పని చేశారని పేర్కొన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా.. ప్రజాతీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని కొనియాడారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తున్న పార్టీ భాజపా అన్నారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. అబద్ధాల్లో ఆ పార్టీకి ఆస్కార్ అవార్డు ఇవ్వవచ్చన్నారు. బడుగు, బలహీనవర్గాలు ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమ్యూనిస్టు వేషాన్ని వేసుకొని ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని భాజపా ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందని చెప్పారు. ఆ పార్టీ నేతలు భాజపా, కేంద్ర ప్రభుత్వం మీద విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దేశానికి వెన్నుపోటు పొడిచి.. మీడియా ముందుకొచ్చి మొసలి కన్నీరు కారుస్తానంటే ఎవరు నమ్మరని ఎద్దేవా చేశారు. సైనికులను కూడా కాంగ్రెస్ పార్టీ అవహేళన చేసి మాట్లాడుతోందని మండిపడ్డారు.

# సమాజానికి శాంతి,ప్రేమను ప్రబోధించిన శాంతిదూత ఏసుక్రీస్తు.. పోచారం



కబురు న్యూస్ బాన్సువాడ, డిసెంబర్ 25



సమాజానికి శాంతి ప్రేమను ప్రబోధించి ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు బోధాలు మానవాళికి మార్గదర్శకాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలు వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లను ఉద్దేశించి మాట్లాడుతూ మన ఆచారాలను గౌరవిస్తూ ఇతరుల ఆచారాలను గౌరవించే గొప్ప మానవత్వం కలిగిన దేశం భిన్న మతాలు, కులాల సమూహమన్నారు. క్రిస్టియన్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఎస్ఐ చర్చ్ ప్రతినిధులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కాసుల బాలరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూర్య జేమ్స్, హకీమ్, క్రిస్టియన్లు, స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ ప్రధాని వాజ్ పేయి జయంతి వేడుకలు



కబురు న్యూస్, మోస్ర, డిసెంబర్ 25



మోస్ర మండల కేంద్రంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు భూపాల్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ఆయన తీసుకున్న నిర్ణయాల వల్ల పార్టీ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. దేశ ప్రధానిగా వాజ్ పెయి బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేశారని ఆయన ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు భూపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ శంకర్, సుదర్శన్ గౌడ్, రాజారెడ్డి, స్వామి గౌడ్, సురేష్ గౌడ్,హ్యన్మగౌడ్, వినోద్, ప్రవీణ్,దశరథ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మాజీ ప్రధాని వాజపేయి కి ఘన నివాళులు...

కబురు న్యూస్, బోధన్ డిసెంబర్25..



భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయికి ఘన నివాళులు అర్పించారు. బుధవారం వాజపేయి జయంతి, జాతీయ సుపరిపాలన దినోత్సవం పురస్కరించుకొని బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండల కేంద్రంలో బిజెపి నాయకులు కందగట్ల రాంచందర్ ఆధ్వర్యంలో వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ సీనియర్ నాయకులు కేసరి శంకర్ గౌడ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు వీరేందర్, చింతల వేణు, కట్కమ్ అరుణ్, కట్కమ్ సుధాకర్, కంజరి ప్రదీప్ కుమార్, గడ్డం అమర్, మోస్రా సాయి, మండల ఉపాధ్యక్షులు నాయిని లక్ష్మణ్ గౌడ్, బర్దిపూర్ ప్రణయ్, అనిరుద్ గౌడ్, కమ్మరి వీరేందర్, దేవేందర్ సింగ్, బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

# ఘనంగా వాజ్ పేయ్ శతజయంతి వేడుకలు





కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, డిసెంబర్ 25 :
దివంగత ప్రధాని అటల్ బీహరి వాజ్ పేయి శత జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.పార్టీ జిల్లా కార్యాలయంలో వాజ్ పేయ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సంధర్బంగా ప్రగతి నగర్ లో బిజేపి ఓబిసి మోర్చ అధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.గౌతంనగర్ లోని స్నేహ సోసైటిలో విద్యార్థులకు పండ్ల పంపిణి చేశారు.భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ,భారతరత్న,స్వతంత్ర సమరయోధులు,క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర వహించిన వ్యక్తి అటల్ జీ అని జాతీయ పునరనిర్మాణం కోసం దేశభక్తి పెంపొందించడం కోసం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో క్రియాశీలకంగా పనిచేసిన వ్యక్తి అని కోనియాడారు.రాజకీయంగా ప్రజల్లో చైతన్యం కోసం దేశ అభివృద్ధే లక్షంగా ప్రజా సేవే మార్గంగా ఏర్పాటు చేసిన జన్ సంఘ పార్టీ అధ్యక్షులుగా తరువాత భారతీయ జనతా పార్టీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి పార్టీ అధ్యక్షులుగా పని చేసి రెండు ఎంపీ స్థానాలకె పరిమితం ఉన్న పార్టీని ప్రభుత్వం స్వాతహాగా ఏర్పాటు చేసేలాగా కృషి చేసిన గొప్ప రాజనీతి పరుడు అటల్ జీ అని కొనియాడారు. మూడు సార్లు భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి సూపరిపాలన అందించి చరిత్రలో ఎక్కిన నాయకుడు, రాజకీయ భీష్మ పితామహుడు అటల్ జీ అన్నారు. రాజకీయ పార్టీలకు అతితంగా అందరు మెచ్చిన నాయకుడు అటల్ బిహారీ వాజ్పేయినాయకత్వంలో భారతదేశంలో విద్య,వైద్యం మౌలిక సదుపాయాల కల్పనకు బాటలు వేసారని అన్నారు.ఆర్థిక వ్యవస్థ పటిష్టకు ఆనాడు వేసిన పునాది నేడు ఐదవ స్థానంలో భారత్ నిలిచిందని,విదేశాంగా విధానంతో సహా అన్ని రంగాలలో గణనియమైన సంస్కరణలు చూసిందన్నారు .పోక్రాన్ – అనుపరీక్ష,లాహెూర్ డిక్లరేషన్ వంటి దౌత్య కార్యక్రమాల ద్వారా శాంతిని పెంపొందించడం జరిగిందన్నారు. అటల్ జీ సేవలు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయన జన్మదినం సందర్భంగా సూపరిపాలన దినంగా మనం అధికారికంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.దింతో ప్రభుత్వం జవాబుతారి తనంతో వ్యవహరించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండల లక్ష్మీనారాయణ,న్యాలం రాజు బిజెపి కార్పొరేటర్లు,మండల అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు



– చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు...





కబురు న్యూస్,నిజామాబాద్,డిసెంబర్ 25 :

ఏసు ప్రభువు బోధనలు ఆయన చూపిన శాంతి,ప్రేమ,సౌభ్రాతృత్వం,సహనమనే గొప్ప లక్షణాలు ఎప్పటికీ ఆచరణీయమని సిఎస్ఐ చర్చ్ రెవరెండ్ సిహెచ్ జార్జ్ అన్నారు.ఈ మేరకు బుధవారం క్రిస్మస్ను పురస్కరించుకొని సి ఎస్ ఐ చర్చి ఆవరణంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలను చేశారు.ఒకరినొకరు కలుసుకొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.చర్చిలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఏసుప్రభు బోధనలను పాదర్లు వినిపించగా ఆలకించారు.ఈ సందర్భంగా సిఎస్ఐ చర్చ్ రెవరెండ్ సిహెచ్ జార్జ్ మాట్లాడుతూ,యేసు క్రీస్తు పుట్టిన రోజును ప్రపంచ ప్రజలు జరుపుకునే ప్రత్యేకమైన పండుగని,యేసు క్రీస్తు పుట్టిన రోజు ప్రజలందరికీ సంతోషం కలగజేసే ప్రపంచ పండగ అని అన్నారు.నుడా చైర్మన్ కేశవేణు క్రిస్మస్ వేడుకల సందర్భంగా మొదటి సర్వీస్కు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రేమ భావాన్ని,సేవా,క్షమా గుణాన్ని బోధించిన ఏసుక్రీస్తు జన్మదినం క్రైస్తవులకు పవిత్ర దినంతో పాటు ప్రపంచవ్యాప్తంగా సంతోషక రంగా నిర్వహిం చుకునే పండుగ క్రిస్మస్ అని తెలియజేశారు. ఏసుక్రీస్తు సూచించిన మంచి మార్గంలో ప్రజలు నడవాలని సుఖ సంతోషాలతో జీవించాలని కలిసిమెలిసి పండుగలు చేసుకోవాలని సూచించారు.అందుకే ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు అని బోధ చేశారు.అనంతరం సి ఎస్ ఐ చర్చి పాస్టర్లు,చర్చి కమిటీ సభ్యులు,నుడా చైర్మన్ కేశవేణు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్నాకర్ లు కలిసి చర్చ్ ఆవరణంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఎస్ఐ చర్చ్ పాస్టర్లు రెవరెండ్ ప్రకాష్,రెవరెండ్ కృపాకర్, పాస్టరేట్ సెక్రటరీ సుధీర్ ప్రకాష రావు,పాస్టరేట్ స్టీవార్డ్ జయప్రసాద్, పాస్టర్ ఎయిట్ ట్రెజరర్ పవన్ కుమార్,పాస్టరేట్ ప్రాపర్టీ సెక్రటరీ సంజు జార్జ్, పాస్టర్ రేట్ ఉమెన్ సెక్రటరీ మేరీ జార్జ్, పాస్టర్ ఎయిట్ యూత్ సెక్రటరీ ప్రసన్న కుమార్, చర్చ్ స్టీవార్డ్ ప్రశాంత్ వినోద్ కుమార్,పాస్టరేట్ సండే స్కూల్ సెక్రటరీ రవి జవన్ తోపాటు చర్చి కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో క్రిస్టియన్ సోదరీ సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# టాటా ఏస్ ఢీకొని మహిళ మృతి







కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,డిసెంబర్ 25 :

నగరంలోని నెహ్రూ పార్క్ వద్ద బుధవారం టాటా ఏస్ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది.పోలీసుల కథనం ప్రకారం సారంగపూర్ గ్రామానికి చెందిన పల్లె సవిత (52)బీడీలు చుట్టుకుంటూ జీవనం సాగిస్తుంది.పని నిమిత్తం ఆమె బుధవారం నగరానికి వచ్చింది. నగరంలోని నెహ్రూ పార్క్ వద్ద రోడ్డు దాటుతుండగా టీఎస్ టీ 7327 నంబరు గల టాటా ఏస్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టాడు.ఈ ఘటనలో పల్లె సవితకు తీవ్రంగా గాయాలయ్యాయి.వెంటనే ఆమెను నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.మృతురాలి అల్లుడు నర్సాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీకి జిల్లా జట్టు ఎంపిక

– ముగిసిన శిక్షణ శిబిరం...




కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 25 :

జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీకి జిల్లా జట్టును ఎంపిక చేశారు.గత వారం రోజులుగా ముప్కాల్ ఇండోర్ స్టేడియంలో అండర్ 20 బాలుర శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది.ఈ శిబిరంలో క్రీడా నైపుణ్యాల ప్రదర్శించిన 12 మంది అనిల్ సందీప్ సిద్ధార్థ సికిందర్ రాజేందర్ రాహుల్ సురేష్ నరేందర్ అబ్రార్ బి సిద్ధార్థ చంద్రమౌళి గోపాల్ లను ఎంపిక చేసి ఈనెల 27 నుంచి 30 వరకు జనగమలో జరిగే 50వ అండర్ 20 ఇయర్స్ బాలుర రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్షిప్ కు పంపనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ లింగయ్య గంగాధర్ రెడ్డిలు తెలిపారు.జిల్లా శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెలకువలు రాష్ట్రస్థాయిలో ప్రదర్శించి రాణించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రజనీకాంత్,డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి నిజాంబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గంగాధర్ రెడ్డి,స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ అంజయ్య ఊషు అధ్యక్షులు ఏలేటి గంగారెడ్డి మండల లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొమ్ముల నరసయ్య స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు చింతల నరసయ్య మోతే గంగారెడ్డి దినేష్ రఘు పిడి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రి చెట్టు కింద మనోళ్లు సినిమా షూటింగ్ ప్రారంభం...

– మొలంగూర్ యూట్యూబర్ ప్రసాద్ కు ఛాన్స్...

**కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 25**



మర్రి చెట్టు కింద మనోళ్లు షూటింగ్ ప్రారంభం. కరీంనగర్ జిల్లా ,మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, మొలంగుర్ గ్రామానికి చెందిన యూట్యూబ్ నటుడు రైటర్ పూదరి ప్రసాద్కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మొలంగూర్ గ్రామస్తుడు దండు కొమురయ్య మాట్లాడారు. మర్రి చెట్టు కింద మనోళ్లు సినిమాలో పూదరి ప్రసాద్ కు అవకాశం ఇచ్చిన శ్రీ నరసింహా చిత్రాలయ బ్యానర్ నరేష్ వర్మా, దర్శకులు ముద్ద%శీ% , దర్శకత్వంలో ఈ సినిమా రానుంది, కరీంనగర్ జిల్లా యూట్యూబ్ రైటర్ అయినటువంటి అనిల్ చొప్పరి, హాస్య నటుడు ప్రసాద్ పూదరికి , ఈ సినమాలో నరేష్ వర్మ, అవకాశం ఇవ్వటం జరిగిందని, వీళ్ళలాంటి మరెందరో ప్రతిభావంతులకి కూడా అవకాశం ఇస్తాను, అని దర్శకులు , నిర్మాత ఇస్తామన్నారని, ప్రమోవ్ దేవా, రంధీర్, కీర్తన స్వర్గం , ముస్కాన్ రాజేందర్ హీరో హీరోయిన్ లు గా నటిస్తున్న, ఈ చిత్రానికి సంబంధించిన ప్రాంభోత్సవాన్ని ప్రముఖ హాస్య నటులు బాబు మోహన్ క్లాప్ కొట్టి ప్రారంభించినట్లు పేర్కొన్నారు . ప్రసాద్ కు అవకాశం ఇచ్చిన సినీ ప్రముఖులకు కృతజ్ఞతలు తెలుపుతూ, సినిమాల అవకాశం దక్కించుకున్న యూట్యూబర్ ప్రసాద్ కు కొమురయ్య శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో రాజీవ్ కనకాల, పృధ్విరాజ్, తెలుగు ఫిలిమ్ ఛాంబర్ అధ్యక్షులు దామోదర్ ప్రసాద్, నిర్మాత సీ కళ్యాణ్, హాజరయ్యారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు...




**కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 25..**



బోధన్ లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం క్రిస్మస్ పండగ పురస్కరించుకొని పట్టణంలోని చర్చిలో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని ఊట్పల్లి గ్రామంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ నాయకులు కేకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టప్పా సాయిలు, డివి సంతోష్, సాయిరెడ్డి, భాస్కర్ రెడ్డి, అశోక్ రెడ్డి, బల్లేపు నర్సయ్య, అహమద్, ఖాదర్ పాషా, జమీల్, పెంటయ్య లు ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, టిపీసీసీ డెలిగెట్ గంగా శంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు నరేందర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,డిసెంబర్ 25 :**



ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు 1వ టౌన్ ఎస్ఎచ్ఓ రఘుపతి తెలిపారు.పోలీసుల కథనం..మాక్లూర్ మండలం మామిడి పల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కరిపే సుమన్ దుబాయ్ నుంచి తిరిగివచ్చాడు.తాగుడు,జల్సాలకు అలవాటు పడి నిజామాబాద్,కోరుట్ల,నవీపేట్ మండలాల్లో తిరుగుతూ ద్విచక్ర వాహనాలను దొంగిలించి వాటిని అమ్మి జల్సాలు చేసేవాడు.దొంగిలించిన వాహనాన్నిఅమ్మడానికి వెలుతుండగా పట్టకొని విచారించగా తాను బైక్ లు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు.అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనాలు రికవరీ చేశారు.

# గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,డిసెంబర్ 25 :**

నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఓ యువకుడిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన ఎండీ సాబేర్ గౌతంనగర్ కు చెందిన అఫ్సర్ అనే యువకుడితో కలిసి గంజాయి విక్రయిస్తుండగా ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 550 గ్రాముల గంజాయి, బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయించిన సాబేర్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# ఘనంగా వాజ్ పేయి శత జయంతి వేడుకలు...

– మిఠాయి పండ్లు పంపిణీ చేసిన బిజెపి నాయకులు...

**కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 25**



భారత మాజీ ప్రధాని దివంగత బిజెపి అగ్ర నేత అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి వేడుకలను బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి, మిఠాయి పండు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. ఉత్తమ పార్లమెంటు సభ్యునిగా, ప్రతిపక్ష నాయకునిగా, దేశ ప్రజలకు ప్రధానమంత్రిగా సేవలందించిన భారతరత్న దివంగత మహానేత పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బిజెపి పార్టీ అగ్ర నాయకులు అటల్ బిహారి వాజ్ పే యి, ఆయన ప్రధానిగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు లేకపోవడంతో, ప్రత్యేకంగా సంస్కరణలను ప్రవేశపెట్టి, జాతీయ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను విస్తరణ కు ప్రత్యేక నిధులు విడుదల చేసి, దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పించిన మహా ఘనుడని ఆయన సేవలను కొనియాడి, ఆ మహనీయుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు. శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి పండ్లు, మిఠాయి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగ జైపాల్, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు నరేందర్, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు కనకం సాగర్, శక్తి కేంద్ర సంయోగులు దొంగల రాములు, రాసమల్ల శ్రీనివాస్, పల్లే శివారెడ్డి, పోతునూరి రాజు, బొజ్జ సాయిప్రకాష్, దాసరి సంపత్, దాసారపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బాక లో ఘనంగా క్రిస్టమస్ వేడుకలు...

– మాజీ ఉపసర్పంచ్ వూట్ల దేవయ్య..

**కబురు న్యూస్, వీణవంక, డిసెంబర్ 25.**



వీణవంక మండలంలోని ఎల్బాక ,వీణవంక,నర్సింగాపూర్,రెడ్డిపల్లి, చల్లూరు, ఘన్ముక్ల,లస్మక్కపల్లి, బేతిగల్ గ్రామాలలో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరగగా, గ్రామ గ్రామాన క్రిస్టియన్ సోదరులు ఏసు పుట్టిన దినాన్ని పురస్కరించుకొని, బుధవారం క్రిస్టమస్ వేడుకలను ప్రార్థన మందిరాలలో ఘనంగా జరుపుకున్నారు. గత వారం రోజులుగా క్రిస్టమస్ వేడుకలు పురస్కరించుకొని, ఏసు నామాన్నిస్మరిస్తూ, వాక్యానిస్మరిస్తూ, బైబిల్ వాక్యాలను పాటల రూపంలో సంతోష సంబరాలతో పాడుతూ,గ్రామ గ్రామాన ఏసు సువార్త ఉత్సవాలను జరుపుతూ, బుధవారం క్రిస్టియన్ సోదరీ సోదరీమణులు, కుటుంబ సమేతంగా నూతన దుస్తులు ధరించి, ఏసు నామాన్ని ఆలపిస్తూ,ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ,కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని,ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో పాస్టర్ల ఆశీర్వచనాలు పొందారు. మండలంలోని ఎల్బాక గ్రామంలోని బెతానియా ఇవాంజిలికల్ ప్రార్థన మందిరంలో పెద్ద ఎత్తున క్రిస్టమస్ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.సంఘ అధ్యక్షులు కలువల రే..దేవానందం, కలువల రే..జోనాదాన్, పాస్టర్ ఇమ్మానియేల్ సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ క్రిస్టమస్ వేడుకలలో సంఘ పరచాలకులు కొయ్యడ జాన్ కాశ పాక లూకా, వూట్ల సుదర్శనం,వేల్పుల స్టీఫెన్, మాజీ ఉపసర్పంచ్ వూట్ల దేవయ్య,వూట్ల దేవదాసు,వూట్ల అశోక్, వూట్ల ఆనందం,వూట్ల హరిప్రసాద్,వూట్ల హరికృష్ణ,క్రైస్తవ సోదర సోదరీమణులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# ఫోర్ వే లైన్ రోడ్ల నిర్మాణాన్ని నిధులను మంజూరు చేయండి .



**కబురు న్యూస్, మెదక్ నర్సాపూర్.డిసెంబర్ 25**

మెదక్4వేలైన్ రోడ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు.బుధవారం మెదక్ జిల్లాలోని పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి పాపన్నపేట మండలంలోని ఏడుపాయల అమ్మవారి ఆలయానికి విచ్చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని రోడ్డు పనుల విస్తీర్ణకు దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తా నుంచి దుబ్బాక అంబేద్కర్ చౌరస్తా వరకు 4వేలైన్ రోడ్డు నిర్మాణానికి రూ. 20 కోట్లు,శిలాజీ నగర్ నుంచి ఏనుగుర్తి, బొప్పాపూర్ మీదుగా వెళ్లే రహదారి నిర్మాణానికి రూ. 40 కోట్ల నిధుల మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కు శుభాకాంక్షలు తెలిపిన అది మల్లేశం...



**కబురు న్యూస్, డిసెంబర్ 25....**

హైదరాబాద్ లో విద్యానగర్ బీసీ భవన్ లో రాజ్యసభ సభ్యులు గా ఏకగ్రీవంగా ఎన్నికై హైదరాబాదుకు వచ్చిన సందర్భంగా ర్యాగ కృష్ణన్నలి కి హృదయపూర్వక శుభాకాంక్షల రాబోయే రోజుల్లో బీసీల కోసం నిరంతరం పార్టీలకు కులాలకతీతంగా బీసీ నినాదంతో ముందుకెళ్తానని అన్నారు .... ఆది మల్లేశం పటేల్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం

# మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పరామర్శ



**కబురు న్యూస్, రామగిరి డిసెంబర్ 25.**

రామగిరి మండలం నాగేపెల్లి గ్రామంలోని కంటి ఆపరేషన్ చేసుకున్న మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ ని వారి ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రేమ నిండాలి...

– అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు
– ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**కబురు న్యూస్, రామగిరి డిసెంబర్ 25**



ప్రేమ, కరుణ, క్షమాగుణాలను ఏసు తన జీవిత సందేశంగా మానవాళికి అందించారు. క్రీస్తు బోధించిన శాంతి, సహనం, ఔదార్యం సర్వదా ఆచరణీయం. ప్రతి మనిషి పరోపకార గుణం అలవరుచుకోకపోతే జీవితానికి అర్థం ఉండదు.ఏసు జన్మించిన పవిత్ర దినమైన క్రిస్మస్ ను క్రైస్తవ సోదర సోదరీమణులు సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు. క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆడబిడ్డ వివాహానికి పూస్తే మెట్టెలు బహుకరించిన సాయి గౌడ్



**కబురు న్యూస్, సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 25**

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామానికి చెందిన ఒగ్గు శ్రీనివాస్ కూతురి వివాహానికి పూస్తే మెట్టలు అందించిన యువజన నాయకుడు జి.సాయిగౌడ్ తన వంతుగా పుస్తె మెట్టల అందజేయడం జరిగింది గ్రామంలో పేదవారికి పెళ్లిళ్లకు పుస్తెమెట్టలు ఆపదలో ఉన్న ప్రజలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ సమాజంలో బడుగు బలహీన వర్గాలను సామాజికంగా ఆర్థికంగా ఆదుకొని వారి కన్నీటిని తూర్చడం కోసం తన వంతుగా పేదలకు ఖర్చు పెడుతూ వారి ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్నాను పేదింటి ఆడబిడ్డలకు నా వంతుగా పెళ్లిళ్లకు పూస్తే మెట్టలు ఆర్థిక సహాయం అందించడం సామాజిక కార్యక్రమాలు చేయడం వల్ల నాకు ఎంతో సంతోషంగా ఉంది ఈ కార్యక్రమంలో జీఎస్కే యువసేన సభ్యులు పోశయ్య మహేష్ ప్రకాష్ గణేష్ మధు ప్రశాంత్ సతీష్ ప్రకాష్ లడ్డు ఆంజనేయులు చంద్రశేఖర్ నాగరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వాళ్ళు సినిమా వాళ్ళ తొత్తులు..

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు

**కబురు న్యూస్, కోరుట్ల డిసెంబర్ 25**



తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తో పాటు మొత్తం కల్వకుంట్ల కుటుంబానికి సినిమా వాళ్లు తప్ప సామాన్య ప్రజలు కనిపించరని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణంలోని కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తూ అదే వేదిక పైనుండి ముఖ్యమంత్రిని విమర్శించడం సంజయ్ కి మతిభ్రమించింది అనడానికి నిదర్శనం అని అన్నారు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయింది ఈ సంవత్సరంలో ఏం పని చేశాడు అని సంజయ్ నిలదీయడం అవివేకమని కెసిఆర్ లాగా ఫామ్ హౌస్ లో పండి పరిపాలన చేయడం లేదని ప్రజల్లో ఉంటూ ప్రజా పాలన చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని జువ్వాడి కృష్ణారావు అన్నారు కల్వకుంట చంద్రశేఖర రావు ఎమ్మెల్యేగా ఎన్నికై సంవత్సరకాలం పూర్తయిందని ఆయన ఈరోజు వరకు అసెంబ్లీకి ఎందుకు హాజరు కాలేదో మాట్లాడే దమ్ము సంజయ్ కుందా అని నిడదీశారు మొత్తం కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ ప్రజల రక్త మాంసాన్ని జలగల్లా పట్టిపీడించారని కల్వకుంట చంద్రశేఖర రావును మొదలుకొని కల్వకుంట్ల సంజయ్ కుటుంబం వరకు తెలంగాణ ప్రజలను దోపిడీ చేశారనికేసీఆర్ ఈ సంవత్సర కాలంలో తెలంగాణ ప్రజల నుండి ఎమ్మెల్యే జీతం రూపంలో తీసుకున్న డబ్బులన్నీ కూడా రికవరీ చేయాలని జువ్వాడి కృష్ణారావుడిమాండ్ చేశారు ఒక దళితుడు అసెంబ్లీ స్పీకర్ గా సమాధ్యక్షుడు హోదాలో ఉండడం చూసి ఓర్వలేక అహంకారంతో అసెంబ్లీకి రావడం లేదని కానీ ఇతర జీతభత్యాలు అన్నీ కూడా తెలంగాణ ప్రజల నుండికేసీఆర్ తీసుకుంటున్నాడని జువ్వాడి కృష్ణారావు అన్నారు అన్నారు సినిమా వాళ్ల గురించి మాట్లాడడానికి సిగ్గుండాలని సామాన్య బీద ప్రజలవైపు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నిలబడుతుందని సినిమా వాళ్ళ వైపు కల్వకుంట కుటుంబము నిలబడుతుందనిఅన్నారు గతంలో కొండగట్టు వద్ద ప్రమాదం జరిగి 60 మందిసామాన్య ప్రజలు మరణిస్తే కనీసం వారిని చూడడానికి ఆ కుటుంబాలను పరామర్శించే తీరిక లేనటువంటి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇతర పారిశ్రామికవేత్తల సంపన్నుల కుటుంబాలలోఏవరైనా మరణిస్తే హుటాహుటిన వెళ్తారని అన్నారు ఈరోజు కూడా మొత్తం కల్వకుంట్ల కుటుంబ%శీ% అదే బాటలో నడుస్తుందని అన్నారు తొక్కిస్లాటలో మరణించిన బీద మహిళ పట్ల ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రజల పక్షాన దర్మం వైపు నిలబడ్డారని కల్వకుంట్ల కుటుంబం మొత్తం కేసీఆర్ ను మొదలుకొని కల్వకుంట్ల సంజయ్ వరకు అధర్మం వైపు నిలబడ్డారని ప్రభుత్వాలు చట్టాలు బాధితుల వైపు సామాన్య ప్రజల వైపు నిలబడాలి అది ధర్మం కనుక రేవంత్ రెడ్డి సామాన్య ప్రజల వైపే ఎప్పటికీ ఉంటారని కల్వకుంట్ల కుటుంబంలో అధర్మం వైపు నిలబడరని అన్నారు సినిమా వాళ్ల గురించి మాట్లాడే ముందు నీకు ఓట్లేసిన పేద ప్రజల గురించి ఆలోచించు సంజయ్ సినిమా వాళ్ల గురించి మాట్లాడడానికి నీకు సిగ్గు అనిపించడం లేదా అని జువ్వాడి కృష్ణారావు అన్నారుఈ కార్యక్రమం లో జువ్వాడి కృష్ణారావు తో పాటు కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి పుప్పాల ప్రభాకర్ డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శులు రాజోజీ సదానంద చారి నేమూరి భూమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్వసీమ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి మాజీ సర్పంచ్ రాజోజి భూమయ్య మేకల నరసయ్య భూస రాజేశ్వర్ సదుల వెంకటస్వామి బోయిని నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# కొండాపురం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దయాకర్ రెడ్డి

## - ఆహ్వానిచ్చిన వీరబాబు

**కబురు న్యూస్,ఖమ్మం,డిసెంబర్ 25:**



పాలేరు నియోజకవర్గంలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ని కొండాపురం గ్రామానికి రావలసిందిగా జిల్లేపల్లి వీరబాబు గారు ఇంటికి ఆహ్వానించి ఆయన చేత మీదగా కొంతమంది ప్రజలకు చీరలు మరియూ పంచాలు పంచిపెట్టడం జరిగింది. అనంతరం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ఫాస్టర్ లు దయాకర్ రెడ్డిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు నాగశ్రీనివాసరావు, శివరామకృష్ణ,దండాల వెంకటేశ్వర్లు,దాసర వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# శోభ కాగ్ చర్చి లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు..



**కబురు న్యూస్, ఖమ్మం, డిసెంబర్ 25:**

పాలేరు నియోజకవర్గం కూసుమంచి గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమంలో శోభ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.. అనంతరం వారు మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన ఈ శుభదినం మీ కుటుంబంలో అందరికీ ఆరోగ్యం, ఆనందం కలుగజేయాలని, క్రీస్తు చూపిన మార్గం సర్వమానవాళికి ఆచరణీయమని.. క్రీస్తు దయ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు..

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు

**కబురు న్యూస్, కోరుట్ల డిసెంబర్ 25**

క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు కోరుట్ల పట్టణంలోని చర్చిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు క్రీస్తు జన్మదినం సందర్భంగా నిర్వహించే కార్యక్రమమే క్రిస్మస్ అని ఏసుక్రీస్తు సర్వ మానవాళి శాంతి సౌభ్రాతృత్వాలను కోరుకున్నారని నేడు ప్రజలందరూ కూడా శాంతి ప్రేమ సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు యేసుక్రీస్తు బోధనలు నేటి మానవ జీవితానికి శాంతి మార్గం చూపుతాయని జువ్వాడి కృష్ణారావు అన్నారు ఈ కార్యక్రమంలో కృష్ణారావుతోపాటు చర్చ్ ఫాదర్ కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ కాంగ్రెస్ నాయకులు వార్డ్ కౌన్సిలర్ ఎంబెరి నాగభూషణం పుప్పాల ప్రభాకర్ ఎలిశెట్టి భూమారెడ్డి మ్యాకల నర్సయ్య ఎడ్ల రమేష్ చిలువేరి విజయ్ క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు

# రాజకీయాలకు వన్నెతెచ్చిన వాజ్ పాయ్

## - పోలాడి రామారావు.

**కబురు న్యూస్,కరీంనగర్, డిసెంబర్, 25**

రాజకీయాలలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ అని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు.బుధవారం ఇక్కడ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన భారత రత్న వాజ్ పాయ్ శతజయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పార్లమెంటులో ఒక్క ఓటు తేడాతో ప్రధాని పదవి వదులుకొని నైతిక విలువలకు మించింది లేదని ఆయన నిరూపించారని చెప్పారు.రాజనీతికి నిలువుటద్దం, రాజీ ఎరుగని దేశభక్తుడు, నిజాయితీ, నిబద్ధతో అజాత శత్రువుగా, స్టేట్స్ మెన్ గా,పార్టీలకతీతంగా కమ్యూనిస్టులతో సహా వాజపేయి ని ఆదర్శ రాజకీయ నాయకుడిగా కొనియాడే వారని,భారత జాతి గర్వించదగ్గ మహా నేత



రాజకీయ భీష్మ పితామహుడు,అటల్ బిహారీ వాజపేయి అని, ప్రతిపక్ష నేతగా, ప్రధానిగా, అత్యున్నత విలువలను ఆయన రాజకీయాలలో పాదుకొల్పారని రామారావు చెప్పారు.పది సార్లు లోక్ సభ సభ్యునిగా, రెండు సార్లు రాజ్య సభ సభ్యునిగా ఉన్న వాజపేయి నేడు ఒక రాజకీయ విశ్వవిద్యాలయం అని, రహదారుల అనుసంధానం వల్లనే గ్రామీణ అభివృద్ధి సాధ్యమని భావించి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పేరుతో ప్రతి ఊరుకు రోడ్లు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.వాజపేయి దూర దృష్టి వల్లే నేడు మనం ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ, అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లగలుగుతున్నామని కొనియాడారు.టెలికాం, టీవీ, ఇంటర్నెట్,విద్యుత్, గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు, పోర్టులు, నేషనల్ హైవేస్, వ్యవసాయ, ఐటీ పారిశ్రామిక , విద్య,వైద్య రంగాల్లో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి ఆయన వేసిన బాటలే కారణం అన్నారు.శత్రుదేశాలను సైతం మిత్ర దేశాలుగా మలుచుకున్న వాజ్ పాయ్ ని దేశ యువత ఆదర్శంగా తీసుకోవాలని అదే మనం వాజపేయికి ఇచ్చిన ఘన నివాళి అని, నేటి యువతరం ఆయన నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని పోలాడి రామారావు అన్నారు.

# ఘనంగా క్రిస్టమస్ వేడుకలు మెదక్ చర్చికి హాజరైన మంత్రులతో సహా సీఎం

**కబురు న్యూస్, సంగారెడ్డి డిసెంబర్ 25**

మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏసు భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న మెదక్ చర్చి గొప్ప దేవాలయంగా గుర్తింపు పొందిందని తెలిపారు. చారిత్రక చర్చి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే మెదక్ చర్చితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడుగా ఇక్కడికి వచ్చి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో ఈ చర్చికి వస్తానని ఆనాడు మాట ఇచ్చానని గుర్తుచేసుకున్నారు. మెదక్ కేతడ్రాల్ చర్చి శతాబ్ది ఉత్సవాలు, భక్తులతో క్రిస్మస్



జరుపుకోవాలనే ఇక్కడకు వచ్చానని తెలిపారు. తమది పేదల ప్రభుత్వమని పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో దళితులు, గిరిజనులకు మేలు జరుగుతోందన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.




క్రిస్మస్ పర్వదాన్ని పురస్కరించుకుని బుధవారం మెదక్ సీఎస్ఐ చర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, కొండ సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు రఘునందన్, సురేష్ షెట్కార్ , మెదక్, నారాయణఖేడ్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్,

# ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న సీఎం...

**కబురు న్యూస్, సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 25**

మెదక్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, దుబ్బాక ఎంపీ రఘునందన్ రావు, తదితరులు వన దుర్గాదేవిని



దర్శించుకున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మెదక్ చేరుకున్న సీఎం రేవంత్. అక్కడ నుంచి ఏడుపాయల వనదుర్గా భవాని



ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మెదక్ చర్చికి చేరుకున్నారు. అక్కడ చర్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆపై అక్కడ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

కబురు న్యూస్,ఖమ్మం డిసెంబర్ 25 :

**– రెవెన్యూ లోకి పూర్వ వీఆర్వోలను తీసుకోవడం మా అదృష్టం.**
**– రెవిన్యూ అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేంద్రరావు హర్షం.**





ఖమ్మం : రెవెన్యూ చరిత్రలో భూ భారతి ఓ మైలురాయిగా కితాబు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల , టీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి , తదితరుల అండతోనే తాము విజయం సాధించామన్న గరికె ఖమ్మంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం పై ప్రశంసలు కురిపించిన వీఆర్వోల రాష్ట్ర అధ్యక్షులు గరికె . గత ప్రభుత్వ పాలనలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు కావడంతో రెండున్నర సంవత్సరాలుగా మానసిక వేదనతో ఆందోళనలో ఉన్న రాష్ట్రవ్యాప్తంగా 5,139 మంది వీఆర్వోల కుటుంబాలకు అండగా నిలుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం విఆర్ఓ లను రెవిన్యూలోకి ఆప్షన్ పద్ధతిలో తీసుకుంటూ నిర్ణయించడం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికి ఉపేంద్ర రావు అన్నారు . మంగళవారం ఖమ్మం లోని టీటీడీసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేంద్రరావు , పలువురు రాష్ట్ర కమిటీ , జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి యావత్ వీఆర్వోల కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు . గత ప్రభుత్వం వీఆర్వోలను రెవెన్యూ శాఖ నుంచి విడదీయడమే కాకుండా గ్రామస్థాయి రెవిన్యూ రద్దుచేసి వీఆర్వోల భవిష్యత్తును అంధకారంలో నెట్టింది అన్నారు . నాటి నుండి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ అధికారులు అనేక దఫాలుగా ఆందోళనలు నిరసనలు తెలిపినా గత ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని అవినీతిపరులుగా గ్రామ రెవెన్యూ అధికారులను చిత్రీకరించి అవమానులకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు . ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వంపై కోటి ఆశలతో ఉన్న వీఆర్వోలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క , రెవిన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తోపాటు మిగతా మంత్రులు , ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు , రాష్ట్ర సీసీఎల్ఏ మరియు ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ , తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ , తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల చైర్మన్, రెవెన్యూ ఎక్స్ పర్ట్ , డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి లచ్చి రెడ్డి , కృషి ఫలితంగా మరియు డిప్యూటీ కలెక్టర్ సంఘం తెలంగాణ తాసిల్దారుల సంఘం కృషి ఫలితంగా గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థ బలోపేతంలో సమస్త విఆర్ఓ లకు ఆప్షన్ పద్ధతిలో తీసుకోవడానికి కృషి చేసిన వారికి ప్రతి ఒక్కరికి తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తరపున గరిక ఉపేంద్రరావు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు .రెవెన్యూ చరిత్రలో భారతి చట్టం 2024 ఒక వరం . గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతంతో పాటు ఈ రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మంది రైతుల భూ సమస్యలు స్థానికంగా వేగవంతంగా న్యాయమైన సమస్యలన్నీ పరిష్కారం చేసే విధంగా చట్టంలో రూపకల్పన చేయటం అట్లాగే ఆప్షన్ విధానం మండల డివిజన్ జిల్లా స్థాయిలలో అవకాశం కల్పించడంతోటే దళిత , గిరిజన , సన్న కారు , చిన్న కారు మధ్యతరగతి , రైతులకు ఎంతో వెసులుబాటును కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గరికె ఉపేంద్ర రావు అన్నారు . రీ డిప్లయ్మెంట్ ద్వారా ఇతర ప్రభుత్వ శాఖల్లోకి బలవంతపు సర్దుబాటు ద్వారా అర్ధరాత్రి వేళ లాటరీ పద్ధతిలో ప్రభుత్వ ఉద్యోగుల సిసిఏ రూల్స్ , ఫండమెంటల్ రూల్స్ కు విరుద్ధంగా తీసుకున్న గత ప్రభుత్వ నిర్ణయం వలన వీఆర్ఓ లందరూ పూర్వపు సర్వీసులు పూర్తిగా కోల్పోయారు . పే ప్రొటెక్షన్ కోల్పోయారు , పదోన్నతులు కోల్పోయారు , డి గ్రేట్ చేయబడి అటెండర్లుగా , కామాటిగా , వంట కుక్కు , స్వీపర్లుగా , మహిళా జీపు డ్రైవర్గా , వార్డు అధికారిగా ఇలా అవమానింపబడి సమాజంలో మానవ హక్కులు కోల్పోయామని అన్నారు . ఆర్థికంగా మానసికంగా తీవ్ర ఆందోళనలకు గురికావడమే కాకుండా జిసిసి లో పనిచేస్తున్న వారికి నేటికీ నెల వారి వేతనాలు రాక మనోవేదనతో ఆర్థిక భారం తట్టుకోలేక ఇద్దరు విఆర్వోలు అకాల మరణం చెందటం చింతించదగిన అంశంగా భావిస్తున్నామని వారు తెలిపారు . గత ప్రభుత్వం నిరంకుశ విధానాల వలన మాకు జరిగిన నష్టాన్ని నేటి ప్రజా ప్రభుత్వంలో గౌరవ ముఖ్యమంత్రి గారికి గౌరవ రెవెన్యూ మినిస్టర్ గారికి గౌరవ ఉప ముఖ్యమంత్రి గారికి అనేక దఫాలుగా సంఘం ఆధ్వర్యంలో మెమొరాండాలు సమర్పించి మా సమస్యల పరిష్కారానికి నివేదించుట మూలంగా మా సమస్యలను సానుకూలంగా తీసుకొని మాకు నేడు గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థలోకి రావడానికి ఆప్షన్ పద్ధతి ద్వారా మమ్మల్ని తీసుకోవడం హర్షించదగిన పరిణామం అన్నారు . నేటి ఆప్షన్ లో గత సర్వీస్ యొక్క పరిస్థితిని ప్రమోషన్ విధానాన్ని ఆప్షన్ ఫామ్ లో పొందుపరచలేదనే అంశం అనేది కొంత ఆందోళన కలిగిస్తున్నది . తప్పకుండా నేటి ప్రభుత్వం వీఆర్వోల న్యాయమైన గత సర్వీసును పరిగణలోకి తీసుకొని కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించాలని గౌరవ ముఖ్యమంత్రి ని గౌరవ రెవిన్యూ శాఖ మాత్యు గారిని కోరారు . విలేకరుల సమావేశంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు చీమల నాగేంద్రబాబు , బంక కృష్ణ , షేక్ జానీ మియా , వజ్జ రామారావు , చర్ల శ్రీనివాస్ , ధరావత్ భాస్కర్ , కిషోర్ , నెల్లూరు లవన్ కుమార్ , బంక భాస్కర్ , శ్రీ వాణి , మల్లీశ్వరి , వాంకుడోత్ వెంకన్న , వస్త్రం ధన్నూరి బాలరాజు , చిట్టి మల్ల నాగేశ్వరరావు , షేక్ నాగుల మీరా మరియు వందమంది పూర్వ విఆర్వోలు పాల్గొన్నారు .

# యుద్ధప్రాతిపదికన మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు

**– మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

కబురు న్యూస్, హైదరాబాద్ డిసెంబర్ 25 :



వరద ముంపునుంచి ఖమ్మం ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు గాను చేపట్టిన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు సచివాలయంలో రిటైనింగ్ వాల్ పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్సీ అనిల్ కుమార్ తదతరులు పాల్గోన్నారు. ఈసమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మున్నేరు ముంపు నుంచి ఖమ్మం పట్టణాన్ని కాపాడేందుకు నదికి ఇరువైపులా ఆర్ సిసి కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నామని, ఖమ్మం నగరంలో ముంపునకు అవకాశం లేకుండా సరైన మార్గంలో వరద ప్రవాహాన్ని నడిపించేందుకు సరైన డిజైన్ తో వాల్ నిర్మించాలని అధికారులకు సూచించారు. వాల్ నిర్మాణపనులు మరింత వేగం పెరగాలని , నెలలో రెండు సార్లు స్వయంగా తానే పర్యవేక్షిస్తానని అన్నారు. ఈ వాల్ నిర్మాణానికి అవసరమయ్యే భూ సేకరణను చేపట్టాలని ఇందుకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో ఖమ్మం జిల్లాలోని అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. వాల్ నిర్మాణానికి ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. 1969 నుంచి 2024 సెప్టెంబర్ వరకు వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకొని వాల్ నిర్మించాలని అన్నారు. ఇటు ఖమ్మం అటు పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు సౌకర్యం కల్పించేలా సుమారు 23 కిలోమీటర్ల మేర వాల్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రైటప్:– మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహిస్తున్న రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి.

# పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**– సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ జె రమేష్**
**– డిసెంబర్ 27,28 లలో జరిగే టోకెన్ సమ్మె నోటీసు ని కార్యదర్శి శ్రీనివాసరావు కి అందజేసిన సిఐటియు....**

కబురు న్యూస్, భద్రాచలం డిసెంబర్ 25 :



ఎంతోకాలంగా పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు కార్మికులందరూ ఒక తాటిపైకి వచ్చి ఉద్యమానికి సిద్ధం కావాలి అని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటి భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27 28 తేదీలలో నిర్వహించనున్న టోకెన్ సమ్మె నోటీసుని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కి అందించారు. ఈ సందర్భంగా ఎ.జె.రమేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని, మల్టి పర్పస్ విధానం రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధనకు గత సంవత్సర కాలంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. అనేక సార్లు సమస్యలను పరిష్కరించాలని పదే పదే వినతి పత్రాలు ఇచ్చినా,దశల వారీగా ఆందోళనలు చేసినా ప్రభుత్వ పెద్దలు స్పందించలేదని ఆరోపించారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో లో కార్మికులకు 18 వేల రూపాయలు ఇస్తామని,ఉద్యోగ భద్రత కల్పిస్తామని,మల్టి పర్పస్ విధానం రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి విస్మరిచారని ద్వియపట్టారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకై ఈ నెల 17 వ తేదీన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో హైద్రాబాద్ కార్యక్రమం నిర్వహించగా,ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి,వెంటనే అనుమతిని రద్దు చేసారని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అక్రమ అరెస్టు లు చేశారని,గృహ నిర్బంధం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులు ఐక్యంగా ప్రభుత్వ నిర్బంధాన్ని సైతం ఎదిరించి వేలాది మంది కార్మికులతో చలో హైద్రాబాద్ కార్యక్రమం విజయవంతం చేశామని గుర్తు చేశారు. ఇన్ని ఉద్యమాలు చేసిన ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 27,28 తేదీలలో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె కు రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ పిలుపునిచ్చారని అన్నారు.టోకెన్ సమ్మె తోనైనా ప్రభుత్వం స్పందించాలని,లేని యెడల జనవరి 5 వ తేదీ తర్వాత నిరవధిక సమ్మె కి దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు టోకెన్ సమ్మె నోటీసు ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు కి అందజేశారు.ఈ కార్యక్రమం లో సిఐటియు పట్టణ కన్వీనర్ యం.బీ నర్సారెడ్డి,ఉపాధ్యక్షులు బండారు శరత్ బాబు,గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు కాపుల రవి,చెన్నకేశవలు, తదితరులు పాల్గొన్నారు.

# పైలాన్ను పరిశీలించిన సిపిఐ నాయకులు


కబురు న్యూస్,ఖమ్మం డిసెంబర్ 25 :



భారత కమ్యూనిస్టు పార్టీ శత సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఏర్పాటు చేయనున్న పైలాన్ పనులను సిపిఐ నాయకులు మంగళవారం పరిశీలించారు. శత సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఈనెల 26న పైలాన్ ఆవిష్కరణ జరగనుంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పైలాన్ వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించి శత ఆవిర్భావ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. పరిశీలించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్, హవేలీ ఏరియా కార్యదర్శి ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గిరిబాబు మాతృమూర్తి మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

కబురు న్యూస్ ఖమ్మం డిసెంబర్ 25 :



వైరా నియోజకవర్గానికి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు మాతృమూర్తి లక్ష్మి మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలుపుతూ మంగళవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ గిరిబాబు కుటుంబ సభ్యులకు నామ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన - మాజీ ఎంపీ నామ

కబురు న్యూస్, ఖమ్మం డిసెంబర్ 25



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని క్రైస్తవ సోదర, సోదరీమణులకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు దైవ జనుల కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన గొప్ప మానవతావాది అని నామ పేర్కొన్నారు. తన ప్రాణ త్యాగం ద్వారా సమాజానికి శాంతి సందేశం ఇచ్చారని, ఎన్ని కష్టాలు ఎదురైనా శాంతి మార్గంలోనే పయనించారని ఆయన గుర్తుచేశారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, దయ, కరుణ విలువలు ప్రతి ఒక్కరు తమ జీవితాల్లో అలవర్చుకోవాలన్నారు. ఏసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించాలని, అందరూ సంతోషంగా జీవించాలని, ఈ క్రిస్మస్ ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని, క్రైస్తవ సోదర, సోదరీమణులు ఆనందోత్సవాల మధ్య క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని నామ ఆకాంక్షించారు.

# కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

కబురు న్యూస్, వేములవాడ :డిసెంబర్ 25 :



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ్ రెడ్డి ఈరోజు రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించార స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకుని సేవలో తరించారునాగిరెడ్డి మండపంలో ఆలయ పర్యక్షకులు బి.తిరుపతి రావు ఎమ్మెల్యే దంపతులకు శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం ఇచ్చారు.వారి వెంట ప్రోటోకాల్ ఏఈఓ అశోక్ , రాజేందర్, సింహాచారి ఆలయ సిబ్బంది ఉన్నారు

# ఆశా వర్కర్ల బస్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ.సిఐటియు.

కబురు న్యూస్, ఖమ్మం డిసెంబర్ 25 :



ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం పద్దెనిమిదివెలు ఇవ్వాలని పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆషా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జారుతున్న బస్ యాత్ర పోస్టర్ ను జలగం నగర్ లో ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు మాట్లాడుతూ రెండువేల ఇరవై మూడు సెప్టెంబర్ లో ఆషా వర్కర్స్ సమ్మె సందర్భంగా ఆరోజు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం 18000 ఇస్తామని పియఫ్ ఇఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.కాని ఒక సంవత్సరం కావస్తున్న నేటి వరకు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీని అమలు చేయలేదని అన్నారు.బస్ యాత్ర ఈ నెల ఇరువై ఆరు వ తేదీ ఖమ్మం వస్తుంది అని ఆషా వర్కర్స్ అందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు మాచర్ల సుభద్ర మండల నాయకులు డి మమత నాగమణి సిఐటియు మండల నాయకులు అర్వపల్లి శ్రీనివాస్ రావు ఏర్పుల శ్రీనివాస్ రావు కళ్ళు గీత కార్మిక సంఘాం జిల్లా నాయకులు కొండం కరుణానిధి పాల్గొన్నారు...

# పోలీసు అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్

కబురు న్యూస్, ఖమ్మం డిసెంబర్ 25 :



హత్య కేసులో ఆరుగురు నిందుతులకు జీవిత ఖైదు శిక్ష, మరొకరికి ఐదు సంవత్సరాలు శిక్ష పడేలా సాక్ష్యాధారాలు సేకరించి పకడ్బందిగా చర్యలు చేపట్టిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించి రివార్డ్ అందజేశారు.రెండువేలపంతొమ్మిది సంవత్సరం సెప్టెంబర్ పది వ తేదిన రాజకీయ వివాదాల కారణంగా పెనుబల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రహ్మళకుంటలో జరిగిన హత్య కేసులో ఆరుగురికి జీవిత ఖైదు, రూ.పది వేల జరిమానా, ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ సత్తుపల్లి కోర్టులో జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి శ్రీ గౌరవ ఎం. శ్రీనివాస్ గారు ఇటీవల తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈరోజు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఇన్స్‌పెక్టర్ టి.రవికుమార్ , ఎస్సై నాగరాజు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అబ్దుల్ బాషా, కోర్టు డ్యూటీ ఆఫీసర్ (కానిస్టేబుల్ ) గిరి, హెూంగార్డు సురేష్ బాబు అభినందించారు....



# ఆ ఒక్క రాత్రి.. మ్యాక్స్

కబురు సినిమా డిసెంబర్ 25..

తనతో మాట్లాడుతున్నప్పుడు మ్యాగ్జిమమ్ సైలెన్స్ ఉండాలని చెబుతున్నాడు 'మ్యాక్స్'. మరి అతని కథేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. కిచ్చా సుదీప్ హీరోగా నటించిన చిత్రమిది. విజయ్ కార్తికేయ దర్శకుడు. వరలక్ష్మీ శరత్‌కుమార్, సునీల్, శరత్ లోహితస్య కీలక పాత్రల్లో నటించారు. కిచ్చా క్రియేషన్స్‌తో కలిసి వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి ఎస్.థాను నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో ఈ నెల 27న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'మా పొలిటికల్ కెరీర్‌కి ఈ రాత్రి చాలా ఇంపార్టెంట్...' అనే వాయిస్ ఓవర్‌తో మొదలయ్యే ట్రైలర్‌లో 'చావు ఎదురొచ్చినా సరే మా అబ్బాయి ఒంటరిగా పోరాడతాడు...', 'ఈ ఒక్క రోజు రాత్రి స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపడదాం...' అంటూ సాగే సంభాషణలు, సుదీప్ చేసిన యాక్షన్ ఘట్టాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# రామోజీ ఫిల్మ్ సిటీలో సంక్రాంతి పాట

కబురు సినిమా డిసెంబర్ 25..

'సంక్రాంతికి వస్తున్నాం'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు వెంకటేశ్. అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ కథానాయికలు. రాజేంద్రప్రసాద్, సాయికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో సిద్ధం చేసిన భారీ సెట్‌లో చిత్రీకరణ చేసుకుంటోంది. దీనిలో భాగంగా నాయకానాయికలపై సంక్రాంతి పండుగ నేపథ్యంలో సాగే ప్రత్యేక గీతాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. భాను మాస్టర్ నృత్యరీతులందిస్తున్నారు. ముక్కోణపు క్రైమ్ కథాంశంతో రూపొందుతున్న



ఈ చిత్రంలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఆయన భార్యగా ఐశ్వర్య రాజేశ్, మాజీ ప్రేయసిగా మీనాక్షి నటిస్తున్నారు. ఈ సినిమా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి కూర్పు: తమ్మిరాజు, ఛాయాగ్రహణం: సమీర్ రెడ్డి.

# ఓటీటీలోకి 'ఆర్ఆర్ఆర్' డాక్యుమెంటరీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

కబురు సినిమా డిసెంబర్ 25..

రామ్ చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'ఆర్ఆర్ఆర్' భారీ వసూళ్లతోపాటు ఎన్నో రికార్డులు నెలకొల్పిన ఈ సినిమా తెర వెనుక సంగతుల సమాహారం 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్'. ఈ నెల 27 నుంచి ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' లో ఈ డాక్యుమెంటరీ స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు సంస్థ పోస్టర్ విడుదల చేసింది. ఎంపిక చేసిన పలు థియేటర్లలో ఈ డాక్యుమెంటరీ ఈ నెల 20న రిలీజైంది సుమారు 3 ఏళ్ల ఈ సినిమా ప్రయాణానికి సంబంధించి 20టీబీ ఫుటేజ్‌రాగా దాన్ని ఎడిట్ చేయడానికే ఏడాది పట్టిందట. బెస్ట్ మూమెంట్స్‌ను తీసుకుని 1:38 గంటల నిడివితో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ విజువల్స్, చిత్ర బృందం అభిప్రాయం తదితర సంగతులు ఇందులో చూడొచ్చు. థియేటర్లలో ఈ డాక్యుమెంటరీని చూసిన కొందరు సినీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయం వ్యక్తం చేయగా టీమ్ స్పందిస్తోంది. వారి సమీక్షలపై ఆనందం వ్యక్తం చేస్తూ వాటిని రీపోస్టు చేస్తోంది. డాక్యుమెంటరీ సినిమా రేంజ్‌లో ఉందని కొందరు.. ఫిల్మ్ మేకర్స్ కావాలనుకుంటున్న వారికి బాగా ఉపయోగపడుతుందని మరికొందరు కామెంట్లు చేశారు.



# ప్రియుడితో ఫోటోను షేర్ చేసిన తమన్నా.. నెటిజన్స్ ఏమంటున్నారంటే



కబురు సినిమా డిసెంబర్ 25..

మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి.తమన్నా ప్రస్తుతం గోవాలో ఉంది. ఈ అందాల భామ గోవాలో తన హాలిడేస్‌ని ఎంజాయ్ చేస్తోంది. అక్కడ నుంచి కొన్ని ఫోటోలను అభిమానులతో పంచుకుంది ఈ చిన్నది. అందులో ఆమె స్నేహితులతో ఎంజాయ్ చేస్తూ కనిపించింది , అలాగే తమన్నా తన ప్రియుడు విజయ్ వర్మతో కలిసి వీడియో గేమ్‌లు ఆడుతున్న ఫోటోలను కూడా షేర్ చేసింది.చిత్రాలను పంచుకుంటూ, "గోవా గేట్‌వే" అనే క్యాప్షన్‌ను రాసుకొచ్చింది. ఈ ఫొటోల్లో తమన్నా చాలా అందంగా మెరిసింది. లస్ట్ స్టోరీస్ 2: వెబ్ సిరీస్ లో తమన్నా, విజయ్ కలిసి నటించారు. ఈ సిరీస్ షూటింగ్ నుంచే డేటింగ్ చేయడం ప్రారంభించామని విజయ్ వర్మ గతంలో తెలిపాడు. 35 ఏళ్ల తమన్నా భాటియా 2005లో 'చాంద్ సా రోషన్ చెహ్రా' చిత్రంతో సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అదే ఏడాది తెలుగు సినిమాల్లోకి కూడా అడుగుపెట్టింది. హ్యాపీడేస్ సినిమా నుంచి ఈ చిన్నదాని క్రేజ్ పెరిగిపోయింది. వరుస ఆఫర్స్ అందుకుంటూ స్టార్ గా మారింది. ప్రస్తుతం హిందీ సినిమాల పైనే ఎక్కువ ఫోకస్ చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.



Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com